
సాక్షి
చిత్తూరు
గురువారం । 26 । జూన్ । 2025



కొనుగోడు!

మామిడి కాయల కొనుగోలులో గుజ్జు పరిశ్రమల సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. - 8లో



ప్రజల ఆరోగ్యంపై ఆటలొద్దు

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఆరోగ్యకర వాతావరణంలో మామిడి గుజ్జు తయారు చేయాలని డీఎంహెచ్‌ఓ కోరారు. - 8లో



పటిష్ట భద్రత

జిల్లాలో ఈవీఎంలు భద్ర పరిచిన గోడౌన్ల వద్ద నిరంతరంగా పటిష్ట నిఘా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

జిల్లా ఉద్యాన సహాయకుల సంఘం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా ఉద్యాన సహాయకుల కార్యవర్గం

రొంపిచెర్ల : ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉద్యాన సహాయకుల యూనియన్ ఎన్నికలు బుధవారం ఏక గ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడుగా పి.నరసింహులు, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసు లు, మనోజ్, కోశాధికారులుగా ఈశ్వర్, అనిత, ఉపాధ్యక్షులుగా అక్రమ్, వెంకటరమణ, అహంతి, సాయిలక్ష్మి, కార్యనిర్వహణ కార్యదర్శులుగా లహరి ప్రియ, సంధ్య, అనురాధ, ప్రచార కార్యదర్శులుగా వినయ్, రాజేష్, అరుణ, మహిళా సంక్షేమ కార్యదర్శులుగా మధులత, రాజేశ్వరి, జాహ్నవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడుగా జి.తిరుమల, జిల్లా అసోసియేట్ ఉపాధ్యక్షులుగా శ్రావణి, జిల్లా కార్యవర్గ సభ్యులును ఎన్నుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా రావాలని సూచించారు.


నవోదయ ప్రవేశాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మదనపల్లి మండలం వలసపల్లి పీఎం శ్రీ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయంలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2026–27 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఈ పరీక్షకు దరఖాస్తులను ఆన్‌లైన్ పద్ధతిలో స్వీకరిస్తారన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు జులై 29వ తేదీలోపు www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 13వ తేదీన ఎంపిక పరీక్ష నిర్వహిస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థి, తల్లిదండ్రుల నివాసం ఉమ్మడి చిత్తూరు జిల్లా అయి ఉండాలన్నారు. విద్యార్థులు 2025–26 విద్యాసంవత్సరంలో 5వ తరగతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ 01.05.2014 నుంచి 31.07.2016 (రెండు తేదీలు కలుపుకొని) మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఇతర సందేహాలకు 89199 56395, 94409 45913 నంబర్‌లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

బ్రోచర్ల గోల్‌మాల్?

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో బ్రోచర్ల గోల్‌మాల్‌పై ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. బ్రోచర్లు ముద్రించకుండానే.. ముద్రించినట్లు బిల్లులు దండుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. బ్రోచర్ల పేరుతో రూ. 6 లక్షల వరకు బిల్లులు గోల్‌మాల్ జరిగాయని, గతంలో ఇక్కడ ఈఓగా పని చేసిన సమయంలో ఈ బాగోతం నడిపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ గోల్‌మాల్‌పై కార్యాలయం మొత్తం గుసగుసలు మొదలయ్యాయి. గతంలో ఇక్కడ పని చేసిన ఓ ఉద్యోగి ఈ బాగోతాన్ని రికార్డులతో సహా బయట పెట్టేందుకు సన్నద్ధమయ్యారని సమాచారం. ఈ విషయంపై రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నారని సమాచారం

వినతుల పరిష్కారంలో అలసత్వం వద్దు



మోహన్ కుమార్, డీఆర్‌ఓ

చిత్తూరు కలెక్టరేట్ : పీజీఆర్‌ఎస్‌లో నమోదైన వినతుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వహించ వద్దని డీఆర్‌ఓ మోహన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో డీఆర్‌ఓ టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పీజీఆర్‌ఎస్‌లో నమోదయ్యే ప్రతి అర్జీకి బాధ్యతాయుతంగా పరిష్కారం చూపించాలన్నారు. నిర్ణీత గడువు లోపు అర్జీలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంపై ప్రభుత్వం అర్జీదారుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. ఈ అంశాన్ని గుర్తించి అధికారులు చిత్తశుద్ధితో అర్జీలను పరిష్కరించాలన్నారు. అర్జీదారులు తమ సమస్యను చెప్పుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఓపికతో అర్జీదారుల సమస్యలను విని అర్థం చేసుకోవాలన్నారు. పరిష్కరించలేని సమస్య అయితే అందుకు గల కారణాలు, ఎప్పుడు పరిష్కారం అవుతుందనే విషయాలను అర్థం అయ్యేలా వివరించాలన్నారు. ప్రతి అర్జీదారుడికి సమస్య పరిష్కరించిన తర్వాత కచ్చితంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ఎటువంటి సందేహాలున్నా పీజీఆర్‌ఎస్ మానిటరింగ్ సెల్‌ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఆదేశించారు.



నాయుడుపేటలోని అంగన్‌వాడీలో నాసిరకంగా కందిపప్పు ప్యాకెట్లు

నిర్లక్ష్య ఒడి!



అభం, శుభం తెలియని చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం చెలగాటమాడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సరఫరా చేసే పౌష్టికాహారాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. కానీ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాసిరకం కందిపప్పును సరఫరా చేశారు. ఒకటి కాదు...రెండు కాదు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇదే దుస్థితి నెలకొంది. వాటిని పరిశీలించి అందజేయాల్సిన జిల్లా ఐసీడీఎస్ అధికారులు చేతులెత్తేశారు. ఫలితంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పురుగులతో బూజు పట్టిన కందిపప్పు సరఫరా అయ్యింది. ఈ తతంగంపై అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సరఫరా అయిన నాసిరకం కందిపప్పు వ్యవహారంపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్.

- అంగన్‌వాడీలకు పురుగుల కందిపప్పు పంపిణీ
- ఇంత అలసత్వమెందుకని ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు
- పరిశీలించకుండానే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా
- జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి
- చిన్నారుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం చెలగాటం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1795 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 625 మినీ కేంద్రాలు మొత్తం 2420 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు 61,739 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు 32,031 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. బాలింతలు 11,593 మంది, గర్భిణులు 12019 మంది అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్నారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున పౌష్టికాహారంలో భాగంగా బాల సంజీవని పథకంలో పది రకాల నిత్యావసర వస్తువులను అందజేస్తారు. బియ్యం 3 కేజీలు, కందిపప్పు 1 కిలో, నూనె 0.500 ఎంఎల్, కోడిగుడ్లు 25, పాలు 5 లీటర్లు, రాగి పిండి 2 కేజీలు, అటుకులు 1 కిలో, బెల్లం 250 గ్రాములు, వేరుశెనగ చిక్కీలు 250 గ్రాములు, ఎండు కర్జూరాలు 250 గ్రాములు అర్హులైన ప్రతి లబ్ధిదారుల ఇంటికి సరఫరా చేస్తారు. ఈ పంపిణీలో భాగంగా ఇటీవల కూటమి ప్రభుత్వం జిల్లాలోని అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరఫరా చేసేందుకు కందిపప్పు సరఫరా చేశారు. ఇలా సరఫరా చేసిన కందిపప్పు పురుగు పట్టి నాసిరకంగా ఉండడం విమర్శలకు తావిస్తోంది.

కమిషన్ల కోసం కక్కుర్తి

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై సర్కారు చెలగాటం ఆడుతోంది. పౌష్టికాహారానికి ప్రాధాన్యం ఇవ్వాల్సింది పోయి కాంట్రాక్టర్‌ల నుంచి కమిషన్‌లకు కక్కుర్తి పడి పురుగు పట్టిన, నాసిరకం కందిపప్పును కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పరిపాలనలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టారు.



కార్వేటినగరం మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసిన పురుగు పట్టిన కందిపప్పు

సీఎం ఇలాకాలోనూ ఇదే పరిస్థితి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహించే కుప్పంలోనూ నాసిరకం, పురుగు పట్టిన కందిపప్పు సరఫరా చేయడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న 428 అంగన్‌వాడీ సెంటర్లల్లోనూ నాసిరకం కందిపప్పు సరఫరా చేశారు. దీంతో ఆ నియోజకవర్గంలోని ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు 12015, మూడు సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల చిన్నారులు 7492, బాలింతలు, గర్భిణులు 6017 మందికి నాసిరకం కందిపప్పు ఇవ్వడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు ఎదురవ్వలేదని చిన్నారుల తల్లిదండ్రులు వెల్లడిస్తున్నారు.



నగరి నియోజకవర్గంలో చిన్నారులకు పంపిణీ చేసిన నాసిరకం, పురుగు పట్టిన కందిపప్పు

- జిల్లాలోని నగరి నియోజకవర్గంలోని 202 అంగన్‌వాడీ కేంద్రాలన్నింటికి 2,476 కిలోల పురుగు పట్టిన కందిపప్పు ప్యాకెట్‌లను సరఫరా చేశారు. ఈ కందిపప్పును ఆ నియోజకవర్గంలోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులందరికీ ఇళ్లకు పంపిణీ చేశారు. ఇలా పంపిణీ చేసిన కందిపప్పు ప్యాకెట్‌లను విప్పి చూడగా మొత్తం పురుగు పట్టి ఉండడం కనిపించింది. ఈ కందిపప్పును పరిశీలించి సరఫరా చేయాల్సిన ఆ శాఖ అధికారులు అలసత్వం చూపించారు. పరిశీలించడం తమ పని కాదని సివిల్ సప్‌లైస్ డీటీలు పరిశీలించి పంపాల్సి ఉంటుందని ఒకరి మీద మరొకరు చెప్పుకుంటున్నారే తప్ప బాధ్యతలను మరిచిపోతున్నారు.

నాసిరకం కందిపప్పు సరఫరా చేయడం దారుణం



అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరైంది కాదు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాసిరకం, పురుగు పట్టిన కందిపప్పు సరఫరా చేయడం దారుణం. జిల్లా మొత్తంగా ఇదే పరిస్థితి కనిపించింది. సీఎం సొంత జిల్లాలో ఈ పరిస్థితి ఉంటే రాష్ట్రం మొత్తం ఇంకెలా ఉంటుందో అర్థమవుతోంది. పురుగు పట్టిన కందిపప్పుతో చిన్నారులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు. నాసిరకం కందిపప్పు పంపిణీలో కమిషన్లను నొక్కేసేందుకు చిన్నారుల జీవితాలతో చెలగాటం ఆడటం సబబు కాదు. నాసిరకం కందిపప్పు పంపిణీపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

– నాగరాజు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల సమాచారం

జిల్లాలోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	1,795
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	625
గర్భిణులు	11,593
బాలింతలు	12,019
7 నెలల నుంచి 3 సంవత్సరాల బాలురు	31,560
7 నెలల నుంచి 3 సంవత్సరాల బాలికలు	30,178
3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల బాలురు	16,708
3సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల బాలికలు	15,523

పరిశీలనలో ఇలా..

కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణుల, బాలింతలకు పంపిణీ చేసిన నాసిరకం, పురుగు పట్టిన కందిపప్పు సరఫరాపై ఈనెల 25న సాక్షి జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ నాసిరకం కందిపప్పు సరఫరా అయినట్లు తేలింది.

- గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని 389 అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం కందిపప్పు సరఫరా చేశారు. ఆ నియోజకవర్గంలోని కార్వేటినగరం మండలం ఆముదాల, సింహరాజపురం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించగా పుచ్చిపోయిన పురుగు పట్టిన కందిపప్పు దర్శనమిచ్చింది. మరికొన్ని చోట్ల తుది గడువు ముగిసిన కందిపప్పు ప్యాకెట్‌లను పంపిణీ చేశారు.
- పుంగనూరు నియోజకవర్గంలో 380 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలం అంగన్‌వాడీ కేంద్రం–3 ను పరిశీలించగా కందిపప్పు నాసిరకంగా ఉంది. అదే విధంగా ఈ నియోజకవర్గంలో ఉన్న 15,431 మంది చిన్నారులకు, 4259 మంది గర్భిణులు, బాలింతలకు మొత్తం పురుగు పట్టిన, నాసిరకం కందిపప్పును సరఫరా చేసేశారు.
- పలమనేరు నియోజకవర్గంలో 408 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం సాక్షి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించింది. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని నీలకుంట అంగన్‌వాడీని పరిశీలించగా పురుగు పట్టిన కందిపప్పు కనిపించింది.



చౌడేపల్లి మండలంలో సరఫరా చేసిన నాసిరకం కందిపప్పు

రైతులకు సేవ చేద్దాం



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న క్లబ్ నేతలు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : జిల్లాలో మామిడి రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, క్లబ్ సేవల్లో ఇకపై రైతులకు సేవ చేసేలా చూద్దామని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ చంద్ర హెచ్ రెడ్డి, మాజీ గవర్నర్ భానుమూర్తి రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి, కోశాధికారిగా ప్రసాద్‌రెడ్డి ఎన్నియ్యారు. గవర్నర్‌లు మాట్లాడుతూ.. మూడోసారి ముచ్చటగా శ్రీధరర్‌రెడ్డి అధ్యక్షుడిగా ఎంపికయ్యారన్నారు. లయన్స్‌గోల్డ్ సేవలను విస్తృతం చేస్తూ..ముందుకు వెళ్లాలన్నారు. ప్రధానంగా జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. బెంగుళూరులో కేజీ మామిడి కాయ రూ.200 వరకు పలుకుతుంటే..ఇక్కడ రూ.4 రూ.5 అంటున్నారు. ఇలాంటి తరుణంలో క్లబ్ తరపున రైతులకు మేలు చేసేలా చూద్దామన్నారు. అలాగే సర్వైకల్ క్యాన్సర్ నివారణకు టీకాలు అందుబాటులోకి వచ్చాయని , 25 మంది ఆడపిల్లలకు తొలి వ్యాక్సిన్ ఖర్చులను తాను భరిస్తానని మాజీ గవర్నర్ వెల్లడించారు. అనంతరం కుట్టుమిషన్లు, గొడుగులు పంపిణీ చేశారు. మాజీ గవర్నర్ విజయభాస్కర్‌రెడ్డి, రీజన్ చైర్‌పర్సన్ లయన్ ఏవీ భాస్కర్, జోన్ చైర్‌పర్సన్ రవి, సభ్యులు సుభాష్ జైన్, మనోహర్, జమీర్ అహ్మద్, నరేష్, మోహన్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, పూల సుబ్రమణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, రమణ, మల్లి, ఎర్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ▶ గురువులు ఆరుగురు

- తమిళ మాధ్యమ టీచర్లపై వివక్ష
- వెబ్ కౌన్సెలింగ్ పేరిట బలవంతపు బదిలీలు
- 252 మంది ఉన్న పాఠశాలకు ఆరుగురే టీచర్లు



230 మంది ఉన్న సత్రవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమిళ మాధ్యమ విద్యార్థులు

నగరి : ఉపాధ్యాయుల బదిలీల్లో తమిళ మాధ్యమ ఉపాధ్యాయులపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీచర్ల బదిలీ ప్రక్రియలో విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ఉపాధ్యాయులు ఉండాలన్న అంశాన్ని పూర్తిగా విస్మరించారనే ఆరోపణలు ఉన్నాయి. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం శ్రీ రంగంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరుగురు తమిళ మాధ్యమ విద్యార్థులు ఉండగా వారికి ఆరుగురు ఉపాధ్యాయులను కేటాయించడం ఆరోపణల్లో వాస్తవికతను చాటి చెబుతోంది. తమిళనాడు సరిహద్దును ఆనుకొని ఉన్న చిత్తూరు జిల్లాలో తమిళ మాధ్యమం కలిగిన 16 ఉన్నత పాఠశాలలు, 40 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. సుమారు 200 మంది తమిళం బోధించే ఉపాధ్యాయులున్నారు. వీరికి ఇటీవల బదిలీల ప్రక్రియ నిర్వహించారు. వెబ్ కౌన్సెలింగ్ మేరకు బలవంతపు బదిలీలు నిర్వహించిన అధికారులు ఆయా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా బదిలీ చేస్తున్నామా? లేదా? అనే అంశాన్ని విస్మరించారు. దీంతో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయి. నగరి మున్సిపాలిటీలో 252 మంది తమిళ మాధ్యమ విద్యార్థులున్న ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 6 గురు ఉపాధ్యాయులను, 230 మంది తమిళ మాధ్యమం విద్యార్థులున్న సత్రవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 6 గురు ఉపాధ్యాయులనే కేటాయించారు. గుడిపాల మండలం శ్రీరంగంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 గురు విద్యార్థులకే ఆరుగురు ఉపాధ్యాయులను కేటాయించారు. అలాగే బొమ్మసముద్రం పాఠశాలలో 8 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లను కేటాయించారు. దీంతో తమిళ ఉపాధ్యాయులు ఇదేమి వెబ్ కౌన్సెలింగ్ అంటూ విస్తుపోతున్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఈ బదిలీలేంటని అవాక్కవుతున్నారు. అధికారులు ఈ అంశంపై దృష్టి సారించి ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలకు ఎక్కువ మంది ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతున్నారు.

చివరి కాయ వరకు మామిడిని కొంటాం



కలెక్టర్‌తో కలిసి జైన్ కర్మాగారంలో పరిశీలిస్తున్న రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు : మామిడి రైతులకు న్యాయం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్ కుమార్ సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని గంగాధర నెల్లూరులోని జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద బుధవారం రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. తోతాపురి మామిడి చిట్టచివరి దాకా ఆగస్టు నెల చివరి కాయ వరకు ఎంత పంట వస్తుందో అంతటిని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మామిడి కాయల కొనుగోలు ధరలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.

మార్కెట్లో డిమాండ్ సప్లై గ్యాప్ వల్ల సమస్యలు ఉన్నాయన్నారు. టోకెన్ పద్ధతి విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇక పది రోజులు ఇలా ఉండొచ్చు తర్వాత అన్ని సమస్యలను తగ్గిపోతాయని కలెక్టర్ చెప్పారు. రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాసులు , సీఐ శ్రీనివాసంతి, జైన్ ఫ్యాక్టరీ మేనేజర్ దిలీప్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఉచిత వైద్యసేవలే లక్ష్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలందించడమే డిజిటల్ సర్వే కేంద్ర లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. టాటా ఎండీ గ్రూప్ కుప్పంలోని 11 పీహెచ్‌సీలు, 2 అర్బన్ హెల్త్ సెంటర్‌కు వచ్చే పేద ప్రజలకు ఉచిత, నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో డిజిటల్ సర్వే సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జులై 1న ఈ సెంటర్ ప్రారంభం కానుందన్నారు. తద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అత్యంత సులభతరంగా అందనున్నాయన్నారు. ఈసెంటర్ ద్వారా ఆరోగ్య స్థితిగతులను నమోదు చేసి టెలీ మెడిసిన్‌తో మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తారని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి సేవలతో పల్లెప్రజలకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుందన్నారు.

పటిష్ట భద్రత

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల ఈవీఎంలు భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ వద్ద నిరంతరంగా పటిష్ట నిఘా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ తప్పనిసరి అని చెప్పారు. బందోబస్తులో ఉండే పోలీసులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌వో మోహన్‌కుమార్, ఏవో వాసుదేవన్, పలు గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, సురేంద్ర, అట్లూరి శ్రీనివాసులు, యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ఆటలొద్దు

గుడిపాల: ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఆరోగ్యకర వాతావరణంలో మామిడి గుజ్జు తయారుచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి సుధారాణి ఆదేశించారు. బుధవారం మండలంలో సీకేపల్లె సమీపంలోని తాసా మ్యాంగో గుజ్జు ఫ్యాక్టరీని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మ్యాంగో పల్ప్ తయారీకి పరికరాలు, రసాయనాలు నాణ్యమైనవి మాత్రమే వినియోగించాలన్నారు. అలాగే ఫ్యాక్టరీలో మామిడి వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారని, అలాగే ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థమైన నీటిని ఫ్యాక్టరీ వెలుపల జన నివాసాల మధ్య నిలువ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం పిచికారీ చేయించి పారిశుధ్యం మెరుగు పరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్, మెడికలాఫీసర్లు సంధ్య, ప్రవీణ్, అనూష, ఆరోగ్య సిబ్బంది వాణి, మోహన్‌శెట్టి, శివ సుబ్రమణి, విజయ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శిగా కొండేటి

నగరి : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్టీఐ విభాగం కార్యదర్శిగా కొండేటి రామమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. తనకు పదవి కేటాయించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ మంత్రి ఆర్కే రోజాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లాటరీ టిక్కెట్లు విక్రయిస్తుండగా మహిళ అరెస్ట్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరం పాత బస్టాండులో బుధవారం ఓ మహిళ లాటరీ టిక్కెట్లు విక్రయిస్తూ వన్‌టౌన్ పోలీసులకు పట్టుబడింది. అందిన సమాచారం మేరకు పోలీసులు లాటరీ విక్రయంపై నిఘా పెట్టారు. లాటరీ టిక్కెట్లు విక్రయించే క్రమంలో రెడ్ హ్యాండెడ్‌గా ఆ మహిళను పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ.5 వేలు విలువ చేసే లాటరీ టిక్కెట్లు, రూ.300 నగదును స్వాధీనం చేసుకున్నారు. కాగా లాటరీ టిక్కెట్ల విక్రయంపై మరింత నిఘా పెంచుతామని, విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ మహేశ్వర పేర్కొన్నారు.

అసలే మామిడి రైతులకు గిట్టుబాటు ధరలేక విలవిల్లాడుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా అన్‌లోడింగ్ పేరుతో పరిశ్రమల సిబ్బంది ఒక్కో అన్‌లోడింగ్‌కు రూ.1000 దాకా వసూళ్లు చేస్తూ రైతుల నడ్డివిరుస్తున్నారు. దీంతో పాటు టోకెన్ల జారీ పేరుతో మరో వెయ్యి దోచేస్తున్నారు. అసలే నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న రైతన్నకు అదనపు వసూళ్లు భారంగా మారుతున్నాయి. ఈ తతంగంపై అన్నదాతలు భగ్గుమంటున్నారు.

- మామిడి కాయల అన్ లోడింగ్‌కు అదనపు వసూళ్లు
- రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుంటున్న ఫ్యాక్టరీలు
- రూ.1000 వరకు కాసుల గుంజుడు
- గుజ్జు ఫ్యాక్టరీలపై మండిపాటు
- ఆవేదనలో మామిడి రైతులు

టోకెన్ల కోసం ఫ్యాక్టరీని ముట్టడిస్తున్న రైతులు (ఫైల్)



కొనుగోడు!

కాణిపాకం : మామిడి కాయల కొనుగోలులో గుజ్జు పరిశ్రమల నిర్వాహకులు అన్నదాతల అవసరాన్ని ఆసరాగా చేసుకుని పలు ఫ్యాక్టరీలోని సిబ్బంది దందాకు తెరతీశారు. టోకెన్ ప్రకారం వరుస నంబరు వచ్చిన వెంటనే అన్ లోడింగ్ ట్రాక్టర్లను పిలుస్తారు. బండితో సహా కాయలను కాటా వేసి అన్‌లోడింగ్ ప్రాంతానికి పంపుతారు. అక్కడ కాయలు దింపేందుకు టీ ఖర్చులనీ రూ. 200 వరకు కూలీలకు ఇవ్వాల్సి ఉంటుంది. తర్వాత ఖాళీ ట్రాక్టర్‌తో వచ్చి కాటా వేసి బండిని బయటకు పంపిస్తారు. ఇందుకు గాను టన్నుకు రూ. 100 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ట్రాక్టర్ రూ. 500 వరకు ఖర్చవుతోంది. ఇదీ సాధారణమని రైతులు చెబుతున్నారు. సిఫార్సులు అధికం కావడంతో పాటు ఫ్యాక్టరీలో పనిచేసే సిబ్బంది పెత్తనం పెచ్చుమీరిందని, తద్వారా కాయలు రోజులు తరబడి ఫ్యాక్టరీ గేటు ఎదుట క్యూ కడుతున్నాయని వారు వాపోతున్నారు.

టోకెన్లు అమ్ముకుంటూ..

కాయలు దింపుడు దందాతో పాటు కొందరు టోకెన్ల దందాకు తెరలేపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టోకెన్ల దందాను కొనసాగిస్తున్నారు. టోకెన్లు కూడా రూ. 1000 చొప్పున అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు, ఫ్యాక్టరీ నిర్వాహకులు మాత్రం టోకెన్ అవసరం లేదని, కోత కోసి కాయలు తెస్తే..వరుస నంబరు ఇస్తారనే విషయం మాటలకే పరిమితమవుతున్నాయి. ఫ్యాక్టరీల వద్ద కాయలు అలానే ఉన్నాయని సాకు చూపి కాయలు కొనుగోలుకు టోకెన్లు, వరుస నంబరు ఇవ్వలేమని నిర్వాహకులు బోర్డులు పెట్టేశారు. ర్యాంపులో కేజీ రూ.2కు దొరికే కాయలను లారీల ద్వారా తెప్పించుకుని..రైతులు నేరుగా ఫ్యాక్టరీలకు తెచ్చే కాయలను చిన్నచూపు చూస్తున్నారు.

నేతల పెత్తనం....

సామాన్య రైతుకు మాత్రమే టోకెన్లు, వరుస సంఖ్యలు అవసరమవుతున్నాయి. అదే కూటమి నేతలు అయితే ఇవేవీ అక్కర్లేదు. నేరుగా గేటు తీసి లోపలికి వెళ్లిపోవడమే. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు కూడా కూటమి నేతల కన్నుసన్నల్లోనే వెళ్లాలనే రూల్ పెట్టారు. ఆరూల్ ఫ్యాక్టరీ నిర్వాహకులు కూడా ఫిదా అయ్యారు. వారి సిఫార్సులతో వచ్చే బండిని నోరు మెదపకుండా లోపలికి అనుమతిస్తున్నారు. రాత్రికి రాత్రే అన్‌లోడింగ్ చేయించుకుంటున్నారు. సామాన్య రైతుల కాయలను రోజుల తరబడి గేటు బయటే కుళ్లిపోయేలా చేస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వంపై అన్నదాతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

చేయి తడిపితే అన్‌లోడింగ్

టోకెన్ లేని రైతులు కాయలను ఏదో రకంగా ఫ్యాక్టరీకి తరలించేందుకు కుస్తీ పడుతున్నారు. ఫ్యాక్టరీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీనిని అదునుగా చేసుకుని పలు ఫ్యాక్టరీలో పని చేసే కొందరు వ్యక్తులు అన్‌లోడింగ్ దందాను మొదలుపెట్టారు. టోకెన్ లేని రైతులతో ముందస్తు ఒప్పందం కుదుర్చుకొని టిప్పు కొడితే చాలు రాత్రికి రాత్రే కాయలు అన్‌లోడింగ్ చేయిస్తున్నారు. ఇందుకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1000 వరకు వసూళ్లు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు సాధారణ చార్జీలు వర్తిస్తాయని ముందస్తు ఒప్పందంలో ఉందని వారు చెబుతున్నారు. గతవారం చిత్తూరు మండలంలోని ఓ ఫ్యాక్టరీలో కాయల అన్‌లోడింగ్‌కు రూ.800 చొప్పున వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వసూళ్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై స్పందించిన జేసీ విద్యాధరి ఫ్యాక్టరీని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

డ్రోన్లతో నిఘా పెంచండి

-ఎస్పీ మణికంఠ చందోలు



మాట్లాడుతున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టే దిశగా జిల్లాలో డ్రోన్లతో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో బుధవారం పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్షించారు. ప్రజలతో సామరస్యంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే దిశగా డ్రోన్ల సాయంతో నిఘా పెంచాలన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేర పరిశోధన చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే సైబర్‌మిత్రను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖరరాజు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం

చిత్తూరు అర్బన్ : తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై ఓ యువతి మంగళవారం మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళా ఎస్‌ఐ నాగసౌజన్య వివరాల మేరకు.. రామ్‌నగర్ కాలనీకి చెందిన జావిద్, గిరింపేటకు చెందిన రేష్మ ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయాన్ని ఇరువురి కుటుంబాలకు తెలిపి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించి నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ క్రమంలో రేష్మను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో జావిద్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తనను మోసం చేసిన జావిద్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు రేష్మ మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ పేలుళ్లల్లో ఒకరి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు





పేలుళ్లు జరిగిన క్వారీ, (ఇన్‌సెట్) మృతి చెందిన రాజు

కుప్పం రూరల్ : కుప్పం పట్టణానికి సమీపంలోని క్వారీలో జరిగిన పేలుళ్లల్లో ఒకరి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. కుప్పం పట్టణానికి సమీపంలోని బీసీఎన్ కన్వెన్షన్ హాల్ వెనుక వైపు కొంత మంది క్వారీ చేపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం బండలను చీల్చేందుకు చేపట్టిన పేలుళ్లల్లో గుడుపల్లె మండలం, పాపానూరు గ్రామానికి చెందిన రాజు (20), మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరిని చికిత్స నిమిత్తం బెంగళూరు ఆస్పత్రికి తరలించేందుకు క్వారీ యాజమాన్యం ప్రయత్నించింది. మార్గమధ్యలోనే రాజు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా ఈ క్వారీపై మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ప్రజలు అధికారులకు ఫిర్యాదు సైతం చేశారు. జనవాసాల మధ్య క్వారీ నిర్వహించడంపై తమ ఇళ్లు బీటలు వారుతున్నాయని పేలుళ్లతో వెలువడే శబ్దాలతో చెవులు పోతున్నాయని అధికారులకు మొరపెట్టుకున్నారు. అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అంగన్‌వాడీల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

నగరి : నింద్ర మండలం అత్తూరు అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు పురుగు పట్టిన కందిపప్పు ఇవ్వడాన్ని వెలుగులోకి తెస్తూ సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'జల్లించి.. ఎండలో వేసి..వండి పెట్టేయండి' అంటూ వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అత్తూరు అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. పిండి అయిన కందిపప్పు స్థానంలో మంచి కందిపప్పు ప్యాకెట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 202 అంగన్ వాడీ కేంద్రాలకు సివిల్ సప్లై గోడౌన్ నుంచి చౌక దుకాణాల ద్వారా 2476 కేజీల కందిపప్పు సరఫరా అవుతుందని ఇందులో చాలా వరకు పాడైపోయినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఎవ్వరికీ సరఫరా చెయ్యకండని అంగన్‌వాడీ సెంటర్లకు కూడా ఆదేశించడం జరిగిందన్నారు. అత్తూరు సెంటర్‌లో మాత్రమే సమాచారం అందకా సరఫరా జరిగిందని దానిని కూడా సరిదిద్దడం జరిగిందన్నారు. సివిల్ సప్లై గోడౌన్ డీటీతో మాట్లాడి 821 కేజీల పాడైన కందిపప్పు వాపసు ఇవ్వడం జరిగిందని ఆ స్థానంలో మంచి కందిపప్పు అందించామన్నారు. ఆమె వెంట ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వెంకటేశులు, ఉపాధ్యాయులు లోకేశ్వరి, ప్రమీల, డీలర్ చంద్రకళ పాల్గొన్నారు.



అత్తూరులో బాలింతకు నాణ్యమైన కందిపప్పు అందిస్తున్న సీడీపీఓ

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న వెంకటమ్మ

పుంగనూరు(చౌడేపల్లె) : కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం మండలంలోని సింగిరిగుంటలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సురేష్ భార్య వెంకటమ్మ (39) కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధ పడుతుండేది. ఇటీవల నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్రగాయాలు

పాలసముద్రం : మండలంలోని తొట్టికండ్రిగ గ్రామం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. తొట్టికండ్రిగ గ్రామంలో గంగజాతర పురస్కరించుకుని పరిసరాలు శుభ్రం చేసి, జేసీబీని రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన యువకులు ద్విచక్ర వాహనంలో వస్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన జేసీబీని ఢీకొన్నారు. దీంతో ఇద్దరి యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని 108 వాహనంలో సోళింగర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు.

విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా నేతలు



తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న జిల్లా నేతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి, ఆర్‌కే రోజా. – తాడేపల్లి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేసే ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ చేపట్టిన సమ్మె బుధవారంతో మూడో రోజుకు చేరింది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శరవణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులు, డ్రైవర్లకు మాత్రమే జీతాలు పెంచిన విధంగానే ఇంజినీరింగ్ విభాగంలో రకరకాల పనులు చేసే కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. అదే విధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె విషయాన్ని మున్సిపల్ శాఖ మంత్రికి విన్నవించినప్పటికీ స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులతో గురువారం సీడీఎంఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి డి.శివకుమార్, కోశాధికారి కే.ఆర్. శివ ప్రసాద్ గౌరవ సలహాదారు పి.వెంకటేష్, ఉపాధ్యక్షులు ఎం.హరికృష్ణ, ఎస్ .వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ టి.గోపాలాచారి, ఏ .ఉష యూనియన్ సభ్యులు కే.వీ.సునీల్ కుమార్,పి.శంకర్,ఎస్. పీరుల్లా, ఎం.వేలు,కే. సుజాత, వెంకటేష్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల:తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 79,466 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,227 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4,05 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

కూటమి నేతల దౌర్జన్యం

- ఏకపక్షంగా వ్యవహరించిన తహసీల్దార్



కాలువపై దారి నిర్మిస్తున్న కూటమి నేతలు

యాదమరి: కట్టకిందవూరులో తమ పొలాలకు వెళ్లే కాలువ మార్గాన్ని దౌర్జన్యంగా కొందరు కూటమి నేతలు ఆక్రమించుకుని జేసీబీతో దారి ఏర్పాటు చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్ రెడ్డి కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ, 50 ఏళ్లుగా తాము ఈ కాలువ గుండా తమ పొలాలకు వెళ్లేవారమని, ఇప్పుడు కూటమి నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించి, జేసీబీతో వచ్చి, మట్టితో దారి ఏర్పాటు చేశారన్నారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ పార్థసారథి సంఘటనా స్థలికి చేరుకున్నారు. ఇరువర్గాలకు సర్ది చెప్పేందుకు యత్నించారు. అయితే చివరికి కూటమి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఏకపక్షంగా వ్యవహరించారు. పది మందికి ఉపయోగపడే చెరువు కాలువ విషయంలో తహసీల్దార్ కూటమి నేతలకు అనుకూలంగా వ్యవహరించారు.

మట్టి గణపతిని పూజించాలి

కాణిపాకం : వినాయక చవితి దృష్ట్యా భక్తులు మట్టి గణపతిని పూజించి.. ప్రకృతికి హాని కలగకుండా చూడాలని ఈఓ పెంచల కిషోర్ అన్నారు. కుమారస్వామి అనే భక్తుడు రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల మట్టి గణపతుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో తొలుత ఆ మట్టి గణపతి పంపిణీని బుధవారం కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలో ప్రారంభించారు. ఈఓ ఈ పంపిణీని ప్రారంభిస్తూ.. మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.

పీజీ సెట్‌లో 88.60 శాతం ఉత్తీర్ణత

తిరుపతి సిటీ : రాష్ట్ర వ్యాప్తంగా 17 వర్సిటీల్లోని 143 పీజీ కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం ఈ నెల 9 నుంచి నాలుగు రోజులు ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పీజీ సెట్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఎస్వీయూలో వీసీ, పీజీ సెట్ చైర్మన్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు సబ్జెక్టుల వారీగా ఫలితాలు వెల్లడించారు. వారు మాట్లాడుతూ పరీక్షలకు 21,995 మంది హాజరుకాగా 19,488 మంది అర్హత సాధించినట్టు తెలిపారు. 88.60 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఎస్వీయూ రీజియన్‌లో 5,764 మంది పరీక్ష రాయగా 5,019 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,422 మంది పరీక్షలకు హాజరుకాగా 1,279 మంది అర్హత సాధించినట్టు వెల్లడించారు. జాగ్రఫీ, జనరల్ టెస్ట్‌లో చిత్తూరు జిల్లాకు చెందిన దివ్వేష్‌రెడ్డి, ఎం.ప్రేమ్ కుమార్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్టు వివరించారు.

సీట్లు 25 వేలు, ఉత్తీర్ణులైన అభ్యర్థులు 19 వేలు

రాష్ట్రంలోని అన్ని వర్సిటీలో 25 వేలకు పైగా పీజీ సీట్లు ఉన్నాయి. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు 19,488 మంది. ఒక సీటుకు ఒక అభ్యర్థి కూడా పోటీ లేకపోవడం విశేషం. తద్వారా 2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్సిటీల్లో పీజీ అడ్మిషన్లు భారీ స్థాయిలో పడిపోనున్నాయి. దీంతో వర్సిటీల భవితవ్యం ప్రశ్నార్థకమేనంటూ మేధావు లు, విద్యానిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పీజీ సెట్-2025 ఫలితాల వివరాలు

కోర్సులు	సెట్‌కు హాజరైన అభ్యర్థులు	ఉత్తీర్ణులైన వారు
కెమికల్ సైన్స్	5,396	4,719
లైఫ్ సైన్స్	3,641	3,408
కంప్యూటర్ కోర్సులకు	1,858	1,547
కామర్స్	1,203	1,009
ఇంగ్లీష్	721	702
హ్యుమానిటీస్	736	726
జువాలజీ	1,347	1,177
గణితం	983	821
ఫిజిక్స్	808	652
బోటనీ	1,146	1,041
ఇతరాలు	4,156	3,686
మొత్తం	21,995	19,488

ప్రెస్, పోలీసు స్టిక్కర్లు అనధికారికంగా వేసుకుంటే చర్యలు

పలమనేరు : జిల్లాలో కొందరు జర్నలిస్టులు కాకున్నా వారి వాహనాలపై ప్రెస్ అని, పోలీసులు కాకున్నా పోలీస్ అని, సైనికులు, పలు డిపార్ట్‌మెంట్ల పేర్లతో పేర్లు రాసుకొని తిరుగుతున్నారని వీరిపై చర్యలు తప్పవని ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు కాకున్నా యూట్యూబ్ విలేకరులమంటూ కొందరు, తాము పోలీసుల బంధువులమంటూ మరికొందరు, వివిధ శాఖలకు సంబంధించి వాహనాలు, ద్విచక్ర వాహనాలపై రాసుకున్న వారిపై తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి సంబంధం లేకుండా బైక్‌లపై ప్రెస్ స్టిక్కర్ వేసుకున్న వారిపై చర్యలు తప్పవన్నారు. కేవలం జిల్లా కలెక్టర్ ద్వారా అక్రిడేషన్ కలిగి ఉన్న విలేకరులు మాత్రమే బైక్‌లపై ప్రెస్ అని వేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన స్టిక్కర్లను తమ శాఖ ద్వారా అందించనున్నట్లు తెలిపారు.